
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 సిద్దిపేట

శనివారం 19 ఏప్రిల్ 2025

వక్ఫ్ సవరణ వద్దు

- బిల్లు తక్షణమే రద్దు చేయాలి
- ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ
- ప్లకార్డులతో నిరసన

7



ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో సిద్దిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

జగ్గారెడ్డి ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ర్యాలీ

సంగారెడ్డి ఐబీ గెస్ట్‌హౌస్ నుంచి పాత బస్టాండ్ అంబేడ్కర్ చౌక్ వరకు పాదయాత్ర

ర్యాలీలో పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి



సంగారెడ్డిలో నిర్వహించిన భారీ ర్యాలీలో ప్లకార్డు పట్టుకొని నడుస్తున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సంగారెడ్డిలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ర్యాలీని నిర్వహించారు. సంగారెడ్డి ఐబీ గెస్ట్‌హౌస్ నుంచి పాత బస్టాండ్ అంబేడ్కర్ చౌక్ వరకు పాదయాత్ర చేపట్టారు. జగ్గారెడ్డి ప్లకార్డు పట్టుకొని నడుస్తూ కాంగ్రెస్ కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ర్యాలీలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీలో జగ్గారెడ్డితోపాటు నిర్మలా జగ్గారెడ్డి, శివసేనారెడ్డి



ప్రత్యేక దుస్తులు ధరించిన ఆలయ ఉద్యోగులతో ఈవో అన్నపూర్ణ

మల్లన్న ఆలయ ఉద్యోగులకు డ్రెస్ కోడ్

- తెల్లరంగు చొక్కా, ధోవతీ ధరించాలి : ఈవో అన్నపూర్ణ

చేర్యాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ ఈవో అన్నపూర్ణ ఆలయ పరిపాలనా అంశాలలో పలు మార్పులకు శ్రీకారం చుట్టారు. ఆలయ ఉద్యోగుల, సిబ్బంది వ్యవహారశైలిపై దృష్టి సారించారు. విధి నిర్వహణపై ఇటీవల పలు సూచనలు చేసిన క్రమంలో ఏళ్ల క్రితం నిలిచిపోయిన డ్రెస్‌కోడ్‌ను పునరుద్ధరించారు. ద్వితీయశ్రేణి అధికారులతో పాటు ప్రతీ ఉద్యోగి నిత్యం తెలుపురంగు చొక్కా, ధోవతి ధరించాలని ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం డ్రెస్‌కోడ్‌ను ప్రారంభించారు. ఈ డ్రెస్ కోడ్‌ను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అలాగే ఆలయ పరిధిలో కొనసాగుతున్న వీరశైవ ఆగమ పాఠశాలలో వేద అభ్యాసనం చేస్తున్న విద్యార్థులు చాలా కాలంగా ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో నిత్యాన్నదాన సత్రం నుంచి అల్పాహారం, భోజనాన్ని మోసుకెళ్తూ తంటాలు పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఈవో అన్నపూర్ణ అన్నదాన సత్రం నుంచి మోసుకు రావడాన్ని నిలిపివేయించారు. ఆగమ పాఠశాలలోని ఓ గదిలో భోజనం తయారీకి చర్యలు తీసుకుని శుక్రవారం అందుబాటులోకి తీసుకొచ్చారు. అనంతరం ఆగమ పాఠశాల విద్యార్థులకు దేవాదాయశాఖ ఆగమ సలహాదారు డాక్టర్ మహంతయ్య స్వామి ఆధ్వర్యంలో రాత, మౌఖిక పరీక్షలు జరపగా ఆమె పర్యవేక్షించారు. ఆయా కార్యక్రమాలలో ఏఈవో బుద్ధి శ్రీనివాస్, ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున్, సూపరింటెండెంట్‌లు సురేందర్‌రెడ్డి, శ్రీరాములు, ఆగమ పాఠశాల అధ్యాపకుడు వీరేశలింగం తదితరులు పాల్గొన్నారు.



పనుల్లో డొల్లతనం

- చేర్యాల పోలీస్‌స్టేషన్ సమీపంలో కోతకు గురైన పార్కింగ్ టైల్స్
- చిన్న వర్షానికే గాంధీచౌక్ జలమయం
- వరదనీటితో కుంటను తలపిస్తున్న అంగడిబజారు చౌరస్తా

8

ఆగమాగం

జిల్లాలో పలుచోట్ల వడగళ్ల వాన

- కొనుగోలు కేంద్రాల్లో, రోడ్లపై ఆరబోసిన ధాన్యం వర్షార్పణం
- వరదలో కొట్టుకుపోయిన వరి
- అన్నదాతలకు తప్పని తిప్పలు
- నేలరాలిన మామిడికాయలు.. కూలిన చెట్లు
- పలుగ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం



దుద్దెడ కొనుగోలు కేంద్రంలో నీటిని తొలగిస్తున్న రైతులు

తొగుట/కొండపాక/మిరుదొడ్డి/చేర్యాల, ఏప్రిల్18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పగలంతా విపరీతమైన ఎండ, వేడి ఉండగా సాయంత్రం ఒక్కసారి వాతావరణం చల్లబడి వర్షం కురిసింది. సిద్దిపేట జిల్లా కేంద్రంలో చిరుజల్లులు కురువగా తొగుట, చేర్యాల, దుబ్బాక, మిరుదొడ్డి, మద్దూరు, కొండపాకతో పాటు పలుమండలాల్లో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వాన కురిసింది. తొగుట మండలంలో మామిడికాయలు నేలరాలాయి. రైతులు రోడ్లపైన ఆరబోసిన, కొనుగోలు కేంద్రాల్లోకి తెచ్చిన ధాన్యం తడిసి వర్షానికి కొట్టుకుపోయింది. ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు పడరాని పాట్లు పడ్డారు. కొండపాక మండలంలో కురిసిన అకాల వర్షానికి రోడ్లపై ఆరబోసిన, కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం కుప్పల్లోకి, కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం కుప్పల్లోకి నీరు చేరింది. అప్పటికప్పుడు కవర్లు కప్పినప్పటికీ లాభం లేకుండా పోయింది. రాజీవ్ రహదారిపై దుద్దెడ మూలమలుపు వద్ద పెద్దవేపచెట్టు ఈదురు గాలులకు నేలకూలింది. రోడ్డు పక్కన ఉన్న ఇంటిపై పడడంతో ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నది. ఈదురు గాలులకు మామిడికాయలు నేలరాలాయి. మండలంలోని దుద్దెడ, బందారం, దర్గా, అంకిరెడ్డిపల్లి, వెలికట్ట, కొండపాక, దమ్మకపల్లి, సిరిసినగండ్ల మర్పడగ తదితర గ్రామాల్లో సుమారు అరగంట పాటు వర్షం కురిసింది. దుబ్బాక మార్కెట్‌యార్డులో ఈదురుగాలులతో కూడిన వర్షానికి ధాన్యం తడిసింది. చీకోడ్, కమ్మర్‌పల్లి, ఆరెపల్లి, గంభీర్‌పూర్ గ్రామాల్లో ఈదురుగాలులకు వడ్లు రాలాయి. మిరుదొడ్డి, మండలంలోని ధర్మారం, లక్ష్మీనగర్ గ్రామాల్లో వడ్లు తడిసాయి. మద్దూరు మండల కేంద్రంతో పాటు సలాఖ్‌పూర్, మర్మాముల, ధర్మారంతో పాటు పలు గ్రామాల్లో వర్షం కురిసింది. ఈదురు గాలులకు పలు గ్రామాల్లో మామిడి కాయలు నేలరాలాయి. సలాఖ్‌పూర్‌లోని కొనుగోలు కేంద్రంలో వడ్లు తడిసాయి. చేర్యాల, కొమురవెల్లి మండలాలలోని పలు గ్రామాలలో శుక్రవారం సాయంత్రం అకాలవర్షం కురిసింది. బలమైన ఈదురుగాలులకు తోడు ఉరుములు, మెరుపుల చప్పుళ్లకు రైతులు, ప్రజలు భయాందోళనకు గురయ్యారు. కొమురవెల్లి, మర్రిముస్త్యాల, గౌరాయపల్లి, ఆకునూరు, తదితర గ్రామాలలోని కేంద్రాలలో ధాన్యం తడిసిపోయింది. పలు కేంద్రాలలో వరదనీరంతా ధాన్యం రాశుల మధ్యలో నిలిచిపోయి కుంటలను తలపించాయి. మరికొంత మంది పొలం నుంచి కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన ధాన్యం ట్రాక్టర్లలోనే తడిసిపోయింది. రోజులతరబడిగా ఆరబెట్టుకుని కాంటా పెట్టేందుకు సంసిద్ధమైన సమయంలో అకాల వర్షం కారణంగా తడిసిపోవడంతో కాంటాకు నోచుకోక ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని వేడుకుంటున్నారు.



మద్దూరు మండలం సలాఖ్‌పూర్‌లో తడిసిన ధాన్యంతో రైతులు

పిడుగుపాటుకు గేదెల మృత్యువాత

పిడుగుపాటుకు చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన గుడిసె కనకయ్య వ్యవసాయబావి వద్ద పాడిగేదె, దూడ మృతిచెందాయి. కడవేరుగు శివారులో గడ్డం నరేశ్ వ్యవసాయబావి వద్ద పాడిగెదె మృతి చెందింది.

కూలిన రేకులపైకప్పు

బలమైన ఈదురుగాలులకు కొమురవెల్లి గ్రామశివారులోని జంగపల్లి పద్మ ఇంటి రేకులపైకప్పు కూలింది. ఈ ఘటనలో పద్మ తలకు, దివ్య కాలుకు గాయాలవడంతో హుటాహుటీన సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మిగతా 8వ పేజీలో..



కొమురవెల్లి మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో నిలిచిన వరదనీరు



చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లిలో పిడుగుపాటుకు మృతిచెందిన గేదె, దూడ



ఘనపూర్ శివారులో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కొట్టుకుపోతున్న దృశ్యం



దుద్దెడ మూలమలుపు వద్ద కూలిన వేపచెట్టు



మర్రిముస్త్యాల కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

మహిళలకు చేయూత

- ఉపాధికి ఊతమిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాలు
- ఉచితంగా కట్టు మిషన్ల పంపిణీ
- కోల్‌ఇండియా సౌజన్యంతో వివేకానంద ఇనిస్టిట్యూట్ కార్యక్రమం

7

మానవత్వం చాటుకున్న ట్రాఫిక్ పోలీసులు

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం ఢీకొని సొమ్మసిల్లిన వృద్ధుడిని గమనించిన ఇద్దరు కానిస్టేబు ళ్లు సకాలంలో ఆస్పత్రికి చేర్చి మానవత్వాన్ని చాటుకున్నారు. దుద్దెడ గ్రామానికి చెందిన 60 ఏళ్ల వృద్ధుడు శుక్రవారం సిద్దిపేట పాత బస్టాండ్ ప్రాంతంలో నడుచుకుంటూ వెళ్తుండగా ఓ ద్విచక్రవాహనం ఢీకొనడంతో రోడ్డుపై సొమ్మసిల్లి పడిపోయాడు. అక్కడే ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు రాజేష్, కమలాకర్ అంబులెన్స్‌కు కాల్ చేసి ఆయనను ప్రభుత్వాసుపత్రికి తరలించి అతడి బంధువులకు సమాచారమందించారు. బైక్‌తో ఢీకొన్న వ్యక్తిని పట్టుకుని సిద్దిపేట వన్ టౌన్ పోలీసులకు అప్పగించారు. సకాలంలో స్పందించిన ఇద్దరు కానిస్టేబుళ్లను స్థానికులు అభినందించారు.



వృద్ధుడికి సపర్యలు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కోతల జోరు.. ఖర్చుతో బేజారు

- అకాల వర్షాలతో హార్వెస్టర్‌కు పెరిగిన డిమాండ్
- గంటకు రూ.2500, చైన్ హార్వెస్టర్‌కు రూ.3వేల వరకు డిమాండ్

7

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

సిద్దిపేట జిల్లావ్యాప్తంగా గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని పలు చర్చిల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సీఎస్ఐ చర్చిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు చర్చి పాస్టర్ ఆంథోని ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యేసు కీర్తనలు ఆలపించారు. బైబిల్ పఠనం చేశారు. భక్తులకు పండ్లు, భోజనం ఏర్పాటు చేశారు. మనుషుల్లో మానవత్వం విలువలు పెరగాలని, యేసు ప్రభువు సూచించిన దారిలో అందరూ నడుచుకోవాలని చర్చి పాస్టర్ ఆంథోని సూచించారు.

సిద్ది పేటకల్చరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి)



సిద్దిపేట సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

వైభవంగా మూలమహోత్సవం

వర్గల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ విద్యాధరి క్షేత్రంలో మూలమహోత్సవ వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. మూలనక్షత్రం విద్యా సరస్వతీ అమ్మవారి జన్మనక్షత్రం సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో ఉదయం అమ్మవారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. పూజల అనంతరం అమ్మవారిని స్వర్ణకిరీటధారణితో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ వేద పండితుల మంత్రోశ్చరణలతో యాగశాలలో చండీ హోమం చేశారు. భక్తులతో లక్ష పుష్పార్చణ, చిన్నారులకు సామూహిక అక్షర స్వీకారాలు ఘనంగా నిర్వహించారు. వేడుకలను తిలకించడానికి భక్తులు అధికంగా తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. క్షేత్రానికి వచ్చిన భక్తులకు ఆలయకమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాదాలను అందజేశారు. వేడుకల సందర్భంగా క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ పరిసరాలు భక్తిపారవశ్యమైనాయి.



మూలనక్షత్రం సందర్భంగా చిన్నారులకు అక్షర స్వీకారాలు చేయిస్తున్న వేదపండితులు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఎగిసిపడిన మంజీరమ్మ

సదాశివపేట, ఏప్రిల్ 18: (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం పెద్దాపూర్ గ్రామ శివారులో 65వ జాతీయ రహదారిపై మిషన్ భగీరథ గ్రిడ్ మెయిన్ పైప్‌లైన్ పగలడంతో లక్షలాది లీటర్ల శుద్ధ జలాలు రోడ్డు పాలయ్యాయి. వరదలు వచ్చిన స్థాయిలో మంజీర నీరు జాతీయ రహదారిపై పారడంతో వాహనాలు నిలిచిపోయాయి. జరుగుతున్నదేమిటో.? అర్థం కాక వాహదారులు భయాందోళనకు గురయ్యారు. జాతీయ రహదారి విస్తరణ పనులు చేస్తున్న నేపథ్యంలో తరచూ ఈ ప్రాంతంలో మిషన్ భగీరథ మెయిన్ గ్రిడ్ పైప్‌లైన్ పగులుతున్నట్లు తెలుస్తోంది. ఇలా పైప్‌లైన్ పగులుతుండటంతో సదాశివపేట మున్సిపాలిటీలో తరచూ మంచినీటి సరఫరా నిలిచిపోతోంది.



జాతీయ రహదారి పక్కన మిషన్ భగీరథ గ్రిడ్ మెయిన్ పైప్‌లైన్ పగిలి ఎగసిపడుతున్న జలాలు

కొత్త పరిశ్రమలకు ఊరట

● సదుపాయాల కల్పన
● 5 కోట్లతో రహదారుల ఏర్పాట్లు చేపట్టిన పరిశ్రమల సమాఖ్య
● జోరుగా నిర్మాణాలు

జిన్నారం, ఏప్రిల్, 18 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి పరిష్కారం కాని రహదారుల ఏర్పాటుకు మోడల్ ఇండస్ట్రీయల్ తరపున 5 కోట్లతో నూతన సీసీ రోడ్ల ఏర్పాటు చేపట్టడంతో ఉపాధి అవకాశాలతో రంగానికి మేలు జరుగుతుంది. ప్రభుత్వ ప్రోత్సాహం, పరిశ్రమల సమాఖ్య సహకారంతో గడ్డపోతారం, కాజీపల్లి పారిశ్రామిక వాడలో నూతన పరిశ్రమ స్థాపన జోరుగా సాగుతోంది.



గడ్డపోతారంలో ఏర్పాటు చేస్తున్న పరిశ్రమ,



కాజీపల్లి పారిశ్రామిక వాడలో ఇటీవల నిర్మించిన సీసీ రహదారి

జోరుగా కొత్త పరిశ్రమల నిర్మాణాలు

జోరుగా కొత్త పరిశ్రమల నిర్మాణాలు మౌలిక వసతులు కొంత కాలంగా చిన్న, మధ్య తరగతి నుంచి భారీ స్థాయి పరిశ్రమల ఏర్పాటు జరుగుతుంది. ఇందులో మూడు పరిశ్రమల యూనిట్లు ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నాయి. గతంలో టీఎస్ ఐపాస్‌లో స్థలాలు పొందిన కొన్ని సంస్థలు, తమ ప్రాంగణంలో ఉన్న ఖాళీ స్థలాల్లో కూడా తమ యూనిట్లను విస్తరిస్తున్నాయి. దీంతో వేల మందికి కొత్తగా ఉపాధి అవకాశాలు త్వరలోనే అందుబాటులోకి వస్తాయి.

5 కోట్లతో రహదారుల ఏర్పాట్లు



మూర్తి

గడ్డపోతారం, కాజీపల్లి పారిశ్రామిక వాడలో 5 కోట్లతో నూతన సీసీ రహదారుల ఏర్పాటు చేపట్టినట్లు మోడల్ ఇండస్ట్రీయల్ అధ్యక్షులు మూర్తి తెలిపారు. పారిశ్రామిక వాడలోని సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల కోసం అసోసియేషన్ తరపున నిరంతరం కృషి చేస్తున్నట్లు మూర్తి తెలిపారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

తొగుట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ బాలుడు మృతిచెందాడు. ఈ సంఘటన గురువారం రాత్రి సిద్దిపేట జిల్లా తొగుట మండలం తుక్కాపూర్ గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన చిక్కుడు స్వామికి ఇద్దరు కుమారులు. గ్రామంలో పోచమ్మ బోనాల పండుగ ఉన్నందున గుడి వద్ద గ్రామస్థులు లైటింగ్ డెకరేషన్ ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి చిక్కుడు స్వామి చిన్న కొడుకు సాయి ప్రణీత్ (12), మరో ఇద్దరు బాలురు పోచమ్మగుడి వద్దకు ఆడుకోవడానికి వెళ్లారు. గుడి ముందు ఉన్న ఇనుప పైపుకు విద్యుత్ సరఫరా కావడంతో సాయిప్రణీత్ చేయి దానికి పొరపాటున తగలడంతో కరెంట్ షాక్ తగిలి కిందపడ్డాడు. అతడిని చుట్టుపక్కల వారు గమనించి చికిత్స కోసం సిద్దిపేట ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మృతిచెందాడు. తండ్రి స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికాంత్‌రావు తెలిపారు.

సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీ మృతి

కంది, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి సెంట్రల్ జైలులో శుక్రవారం రిమాండ్‌లో ఉన్న ఖైదీ ఒకరు మృతి చెందారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన ఇజ్జల వెంకట్ (39)ను ఈ నెల 3న గంజాయి కేసులో నర్సాపూర్ అబ్కారీ పోలీసులు అరెస్ట్ చేసి సంగారెడ్డి సెంట్రల్ జైలుకు రిమాండ్‌కు పంపించారు. వెంకట్‌కు గురువారం రాత్రి ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో అక్కడ ఉన్న జైలు వైద్యులు అతడికి ప్రథమ చికిత్స చేశారు. కోలుకున్న వెంకట్‌కు శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు మళ్లీ ఫిట్స్ వచ్చి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. జైలు వైద్యులు అతడిని సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే వెంకట్ గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని సంతోష్‌రాయ్ వెల్లడించారు. మృతదేహాన్ని మార్చురీలో భద్ర పరిచారు. పోస్ట్‌మార్టం రిపోర్ట్ అనంతరం ఖైదీ మృతికి కారణాలు స్పష్టమవుతాయని వైద్యులు తెలిపారు.

మోటార్ సైకిళ్ల చోరీ కేసులో నిందితుల అరెస్ట్

గుమ్మడిదల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని పోలీసులు పట్టుకొని విచారించగా వివిధ జిల్లాల నుంచి ఏడు బైకులను దొంగతనం చేసినట్లు ఒప్పుకోవడంతో కేసు నమోదు చేసి నింతితుడిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ రవీందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం గుమ్మడిదల పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో జిన్నారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎండీ నయీముద్దీన్ , గుమ్మడిదల ఎస్సై మహేశ్వర్ రెడ్డితో కలిసి మాట్లాడుతూ గుమ్మడిదల టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా హైదరాబాద్ వైపు నుంచి నెంబర్ లేని పల్సర్ బైక్ పైన ఇద్దరు వ్యక్తులు అనుమానస్పదంగా కనిపించారు. బైకులు ఆపి విచారించగా అందులో ఒకని పేరు ప్రేమ్ కుమార్, ఎలక్ట్రీషియన్ మియాపూర్ ఏరియా ప్రాంత వాసిగా గుర్తించారు. ఇతనితో పాటు ఇంకో 7 గురు మైనర్లు కలసి గుమ్మడిదల పీస్ పరిధిలో 2 బుల్లెట్ బైక్‌లు, 1 స్కూటీ, దుండిగల్ పీస్ పరిధిలో 2 బైక్ లు, నర్సాపూర్ పీస్ మెదక్ జిల్లా పరిధిలో 1 బైక్, చిట్యాల పీస్ నల్గొండ జిల్లా పరిది లో 1 బైక్ మొత్తం 7 వాహనాలను చోరీ చేసినట్లు అంగీకరించారు. నిందితుల నుంచి 7 వాహనాలను రికవరీ చేసి వారి వద్ద నుంచి 4 సెల్ ఫోన్‌లను సీజ్ చేసి, నిందితుడిని రిమాండ్‌కి పంపించినట్లు తెలిపారు. ఇట్టి కేసును ఛేదించిన సిబ్బంది కిషోర్, అద్వైత రెడ్డిని డీఎస్పీ అభినందించారు.



గుమ్మడిదల పోలీస్ స్టేషన్‌లో నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

ధాన్యం కుప్పలను ఢీకొని వ్యక్తికి గాయాలు

కొండపాక, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్పలను ఢీకొని ఓ వ్యక్తికి తీవ్రమైన గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం కొండపాక శివారులో జరిగింది. కుకునూరుపల్లి మండలం లకుడారం గ్రామానికి చెందిన గుర్రాల చంద్రం అనే వ్యక్తి మోటార్ సైకిల్‌పై తిమ్మారెడ్డిపల్లి నుంచి కొండపాకకు వెళ్తుండగా, అదుపుతప్పి రోడ్డుపై పోసిన ధాన్యం కుప్పలపైకి దూసుకుపోయి కింద పడ్డాడు. దీంతో అతడికి తీవ్రమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు.



విద్యుత్ షాక్ తగిలి రైతు మృతి

మర్కుక్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఓ రైతు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మర్కుక్ మండలం చేబర్తి గ్రామంలో జరిగింది. మర్కుక్ ఎస్సై దామోదర్, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని చేబర్తి గ్రామానికి చెందిన ఎలిమెల పోచయ్య(50) అనే రైతు తనకున్న కొద్దిపాటి పొలంలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవాడు. తన పొలానికి సమీపంలోనే కొండపోచమ్మ సాగర్ జలాశయానికి సంబంధించిన ప్రధాన కాలువ ఉంది. ఈ కాలువలో విద్యుత్ మోటారును దించి పైపుల ద్వారా వ్యవసాయానికి సంబంధించి సాగునీటిని వాడుకుంటున్నాడు. ఈ క్రమంలో విద్యుత్తు మోటారు పాడయింది. దాని మరమ్మతులు చేసేందుకు కాలువలోకి దిగాడు. అదే సమయంలో మోటారుకు విద్యుత్తు సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. తన పోచయ్య భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పుల్‌కల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ మహిళ ఆస్పత్రిలో మరణించింది. పుల్‌కల్ ఎస్సై పాటిల్ క్రాంతికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. టేక్మాల్ మండలం ఎల్కుగొండ గ్రామానికి చెందిన యాదగిరి ఈ నెల 14న తన తల్లి సత్తమ్మ, చెల్లెలు నర్సమ్మలను టీఎస్35టీ 5215 నంబరు గల ఆటోలో ఎక్కించుకుని స్వగ్రామం నుంచి పటాన్‌చెరు మండలం చిట్కుల్ వెళ్తున్నాడు. చౌటకూర్ గ్రామ శివారులోని 161 జాతీయ రహదారిపై గల ఫ్లై ఓవర్ వంతెనపై ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ సంఘటనలో సత్తమ్మ తీవ్రంగా గాయపడింది. చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తీసుకెళ్లారు. సత్తమ్మ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. ఈ మేరకు ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తల్లీ, కుమారుడు అదృశ్యం

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దౌలాపూర్ గ్రామానికి చెందిన ముక్కెర లావణ్య కనిపించడంలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. దౌలాపూర్ గ్రామానికి చెందిన పోచమ్మ మల్లయ్య దంపతుల కుమార్తె ముక్కర లావణ్యకు గజ్వేల్ మండలం కొల్లూరు గ్రామానికి చెందిన వేముల కృష్ణతో పది సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఆమె పది నెలలుగా తల్లిగారి నివాసమైన దౌలాపూర్‌లో తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. లావణ్య, తన కుమారుడు గురువారం రాత్రి నుంచి కనిపించడంలేదు. వారు కనిపించకుండా పోవడంతో వారి తల్లిదండ్రులు శుక్రవారం జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



అదృశ్యమైన తల్లి, కుమారుడు

బైక్‌ల దొంగలు అరెస్ట్



బైకులను స్వాధీనం చేసుకున్న పోలీసులు

జహీరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాలను దొంగలిస్తున్న నిందితులను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపించినట్లు జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు కేసు వివరాలు వెల్లడించారు. జహీరాబాద్‌కు చెందిన మహ్మద్‌అల్తాప్, 16సంవత్సరాలున్న బాలుడు కలిసి పట్టణం నుంచి పల్సర్(టీఎస్15-ఈటీ3826), యాక్టీవా(టీఎస్12-ఈకే2859) ద్విచక్రవాహనాలపై జహీరాబాద్ మీదుగా హైదరాబాద్‌కు వెళ్తుండగా ట్రాఫిక్‌సిగ్నల్స్ వద్ద వారిని ఆపి తనఖీలుచేసి విచారించగా బైకుల దొంగలని తేల్చారు. వీరు గతేడాది కాలంగా దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. దొంగతనాలు చేస్తున్నప్పుడు ఎవరైనా అడ్డగిస్తే వారివెంట ఉంచుకున్న చాకులు, కమ్మకత్తులతో దాడులు చేయడం, అవసరమైతే ప్రాణాలను తీసేవారన్నారు. వారి వద్ద ఉన్న మారణాయుధాలు, 8 బైక్‌లను స్వాధీనం చేసుకుని అరెస్ట్‌చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈఘటనను చేధించిన పోలీసులను ఆయన అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

రామచంద్రాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా వేగంగా వస్తున్న వాహనం ఢీ కొట్టడంతో మృతి చెందాడు. ఈ ఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. శుక్రవారం ఉదయం ఓ గుర్తుతెలియని(45-50) వ్యక్తి రేడియల్ రోడ్డు 7 ఎక్స్టెన్షన్ దాటుతుండగా అతివేగంగా వచ్చిన వాహనం ఢీ కొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు కొల్లూరు పోలీసులను సంప్రదించాలని సీఐ కోరారు.

ఎద్దుకు మత్తు మందు ఇచ్చి చోరీ

కొండాపూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుంతపల్లిలో గుర్తుతెలియని వ్యక్తులు ఎడ్లకు మత్తు మందు ఇచ్చి ఎద్దును ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన గురువారం రాత్రి జరిగింది. గుంతపల్లి గ్రామానికి చెందిన మందుల రాంచంద్రయ్య ఊరికి పక్కన ఉన్న తన కొట్టం(గుడిసె)లో రెండు ఎద్దులను గురువారం సాయంత్రం కట్టేసి ఉంచాడు. అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కట్టేసి ఉంచిన ఎద్దులకు మత్తు మందు ఇచ్చి తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. మత్తు మందు ఇవ్వడంతో ఒక ఎద్దు అక్కడే స్పృహ కోల్పోవడంతో ఒక ఎద్దును ఎత్తుకెళ్లినట్లు, స్పృహ కోల్పోయి పడిన ఎద్దును పశువుల డాక్టర్‌తో వైద్యం చేయించి పోలీసులకు సమాచారం అందించినట్లు బాధిత రైతు రాంచంద్రయ్య తెలిపారు.



స్పృహ కోల్పోయిన ఎద్దు

కరెంట్ షాక్‌తో గొర్రెల కాపరి మృతి

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ కరెంట్ షాక్‌తో గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన చిన్నశంకరంపేట మండలంలోని చందంపేట గ్రామంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబీకుల వివరాల మేరకు గ్రామానికి చెందిన క్యాసారం దాసు (30) అదే గ్రామానికి చెందిన గొల్ల మల్లయ్య వద్ద గొర్రెల కాపరిగా పని చేస్తున్నాడు. గొర్రెలను మేత కోసం చందంపేట గ్రామ శివారులోకి తోలుకెళ్లాడు. వేసవి కాలం కావడంతో దాసుకు దాహం వేసింది. నీళ్లు తాగేందుకు ఓ బారుబావి వద్దకు వెళ్లి మోటార్ స్టాటర్ స్విచ్ ఆన్ చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తూ కరెంట్ షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతినికి భార్యా నాగలక్ష్మి, ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతుని భార్యా శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు.



క్యాసారం దాసు (ఫైల్)

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

న్యాల్‌కల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగ్వార్‌శివారులో శుక్రవారం 45 సంవత్సరాలున్న గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించిందని హద్నూర్ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గంగ్వార్‌శివారులో ఒకరు ద్విచక్రవాహనంపె నుంచి పడిపోయి మృతిచెంది ఉన్నాడని సమాచారం అందింది. మృతుడికి సంబంధించిన వారెవరైనా ఉంటే 8712656769, 8712661850, 8978289929 నెంబర్లకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. మృతదేహాన్ని జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి పంపించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు.


రోడ్డుపై గుంతలు పూడ్చివేత

శివ్వంపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన శివ్వంటలోని పెద్ద చెరువు కట్టపై రోడ్డు భారీగా గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతుండడంతో శుక్రవారం మాజీ జెడ్పీటీసీ మహేష్ గుప్తా సహకారంతో మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, ఉపసర్పంచ్ వెంకటేష్‌లు గుంతలను పూడ్చివేశారు.

భక్తులకు నీడనిచ్చే పందిరి ఏర్పాటుకు అడ్డంకులు

కొల్చారం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఏడుపాయలకు వెళ్లే భక్తులకు నీడ కోసం మండలంలోని పోతంశెట్టిపల్లి శివారులో ఏర్పాటు చేస్తున్న తాత్కాలిక పందిరిని స్థానికులు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే.. గురువారం ఆంధ్రజ్యోతిలో 'బస్సు వచ్చే దాకా ఎండలోనే..' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆర్టీసీ అధికారులు స్పందించారు. ఏడుపాయలకు వెళ్లే బస్సుల కోసం ఎదురుచూసే చోట తాత్కాలిక చలువ పందిరిని ఏర్పాటు చేసేందుకు మెదక్ ఆర్టీసీ డీఎం సురేఖ చొరవ చూపారు. శుక్రవారం ఆర్టీసీ సిబ్బంది సంగమేశ్వర్‌తో ఆమె అక్కడికి చేరుకుని పందిరి నిర్మించాలని సిబ్బందికి సూచించారు. కర్రలు, తడకలు కూడా అక్కడికి చేరుకున్నాయి. అయితే, స్థానికంగా ఉండే కొంతమంది బస్టాండ్ ఏర్పాటు చేస్తే మా స్థలాలకు ఇబ్బందులు ఉంటాయని అడ్డుకున్నారు. భక్తుల కోసం చూస్తే తమ ప్లాట్లకు నష్టం వాటిల్లుతుందని, ఇక్కడ ఎలాంటి షెడ్డు వేయొద్దని కోరారు. దీంతో అధికారులు చేసేదేమీ లేక వెనుతిరిగి వెళ్లిపోయారు.

సీఎం, మంత్రుల దృష్టికి రేడియల్ రోడ్డు సమస్యలు



ఎక్స్‌లో చేసిన పోస్ట్

రామచంద్రాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : తెల్లాపూర్‌లో రేడియల్ రోడ్డు సమస్యలను సీఎం, మంత్రుల దృష్టికి వెళ్లాయి. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'ప్రమాదకరంగా రేడియల్‌రోడ్డు ఎక్స్‌టెన్షన్-30' కథనంపై స్థానికంగా చర్చసాగింది. ఇక్కడి అసోసియేషన్ల అధ్యక్షుడు రమణ సోషల్‌మీడియా 'ఎక్స్' ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ క్రాంతికు ఎక్స్‌లో టాగ్ చేశారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన క్లిపింగ్‌తో పాటు రోడ్డుకు సంబంధించిన మరిన్ని సమస్యలు పొందుపర్చారు. వేల సంఖ్యలో ప్రజలు ఎక్స్‌లో వీక్షించడంతో పాటు కామెంట్స్ చేశారు.


జహీరాబాద్‌లో కుట్టు పనిలో శిక్షణ పొందిన మహిళలకు అందజేసిన కుట్టు మిషన్‌లు(ఫైల్)

మహిళలకు చేయూత

ఉపాధికి ఊతమిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాలు

ఉచితంగా కుట్టు మిషన్ల పంపిణీ

కోల్‌ఇండియా సౌజన్యంతో వివేకానంద ఇనిస్టిట్యూట్ కార్యక్రమం

జహీరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : పలు సంస్థలు మహిళల ఉపాధికి ఊతమందిస్తున్నాయి. ఆర్థికంగా చేయూతనందించేందుకు తమ వంతు సహాయాన్ని చేస్తున్నాయి. కొన్ని సంస్థలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నిరుపేదల అభ్యున్నతికి తోడ్పాడుతున్నాయి. ఆయా రంగాల్లో మెలకువలను నేర్పుతూ శిక్షణనిస్తున్నాయి. అలాంటి సంస్థల్లో కోల్ ఇండియా ఒకటి. కోల్‌ఇండియా సౌజన్యంతో వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లను అందించడమే కాకుండా కుట్టులో మెలకువలను నేర్పిస్తున్నారు.


మహిళలకు కుట్టు మిషన్లను అందజేస్తున్న ప్రముఖులు(ఫైల్)

600 కుట్టు మిషన్‌లు అందజేత

జహీరాబాద్ నియోజకవర్గంలో కోల్‌ఇండియా వారు ఇప్పటి వరకు 600 కుట్టు మిషన్‌లను అందజేశారు. త్వరలో మరో 250 వరకు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో కుట్టులో మెలకువలను నేర్పించేందుకు మహిళలకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు. కోహీర్, ఝరాసంగం... మొగుడంపల్లి, న్యాల్‌కల్, మిర్జాపూర్‌తో పాటుగా జహీరాబాద్ పట్టణంలో నాలుగు చొప్పున మొత్తం ఎనిమిది శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిల్లో 250 మంది మహిళలకు కుట్టు పనుల్లో తర్ఫీదు ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆరు నెలలుగా ఇస్తున్న కుట్టు శిక్షణ నిరుపేద మహిళల జీవనోపాధికి ఎంతగానో దోహదపడుతున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ శిక్షణతో మహిళలు తాము స్వశక్తితో ఎదుగుతామనే ధీమా కల్పిస్తున్నారు.

మహిళల్లో ధైర్యాన్ని నింపుతున్నాం



మహిళలకు కుట్టులో శిక్షణనిచ్చి, వారు స్వశక్తితో బతుకగలమనే ధైర్యాన్ని నింపుతున్నాం. ఆర్థికంగా ఎదిగేందుకు సహకరిస్తున్నాం. కుట్టు పనిని నేర్పించి, కుట్టు మిషన్లను అందజేస్తే నిరుపేద మహిళలను ఆదుకున్న వారమవుతామని సంస్థ దృష్టికి తీసుకెళ్లాం. ఈ యూనిట్‌ను జహీరాబాద్‌కు తీసుకురావడంలో నావంతు బాధ్యతగా కృషిచేశా.

-కె.లక్ష్మారెడ్డి, ఆల్‌ఇండియా కోల్‌సెక్టార్ ఇన్‌చార్జి

స్వశక్తితో ఎదిగేందుకు కష్టపడాలి



మారుతున్న కాలానుగుణంగా సమాజంలో మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు కష్టపడాలి. నేను ఇప్పటివరకు 150 మందికి కుట్టు పనుల్లో శిక్షణనందిస్తున్నా. జహీరాబాద్ పట్టణంలోని మాణిక్ ప్రభు మందిరంలో శిక్షణనిస్తున్నాం. ఒక్కో బ్యాచ్‌లో 30 మంది మహిళలు ఉన్నారు. అన్ని రకాల దుస్తులు కుట్టేలా మెలకువలను నేర్పిస్తున్నాం.

- దేశెట్టి కవిత, ట్రైనర్

కుట్టు పనులు ఎంతో దోహదపడతాయి



కోల్‌ఇండియా, వివేకానంద ఇనిస్టిట్యూట్ వారు నేర్పిస్తున్న కుట్టు పనులు మాలాంటి నిరుపేదలకు ఎంతో దోహద పడుతాయి. ఇంట్లో కుట్టు మిషన్ ఉంటే ఇతరత్రా పనులను చేసుకుంటు ఖాళీ సమయాల్లో అదనంగా ఆదాయం సంపాదించ డానికి ఉపయోగపడుతుంది. ఇలాంటి పథకాలతో జీవనోపాధి దొరుకుతుంది.

- తూంకుంట జయమ్మ, జహీరాబాద్

ఓపెన్ స్కూల్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- **రేపటి నుంచి 26 వరకు పరీక్షల నిర్వహణ**
- **పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు**

సంగారెడ్డి అర్బన్/సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) : ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 20వ తేదీ నుంచి 26 వరకు నిర్వహించనున్నారు. సంగారెడ్డి జిల్లాలో పదో తరగతికి తొమ్మిది కేంద్రాలు, ఇంటర్మీడియట్‌కు 15 కేంద్రాలను ఏర్పాటు చేశారు. సిద్దిపేట జిల్లాలో పదో తరగతికి నాలుగు కేంద్రాలు, ఇంటర్మీడియట్‌కు ఐదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటలు, తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. సంగారెడ్డి జిల్లాలో పరీక్షల నిర్వహణకు ఆరు స్టోరేజ్ పాయింట్లు, 24 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 24 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 24 మంది జాయింట్ కస్టోడియన్లు, 379 మంది ఇన్విజిలేటర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ మూడు బృందాలు, డీఆర్డీసీ రెండు కమిటీలను నియమించారు. జిల్లా వ్యాప్తంగా టెన్త్ 2,195 మంది, ఇంటర్ 4,334 మంది మొత్తం 6,529 మంది పరీక్షలు రాయనున్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్ అధికారులను నియమించనున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండనున్నది. సందేహాల కోసం కంట్రోల్ రూమ్ 08455-276434, లేదా ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్ వెంకటస్వామి 8008403635 నంబరును సంప్రదించాలని అధికారులు కోరారు.

రెగ్యులర్ మాదిరిగానే ఓపెన్ పరీక్షలు



- ఎస్.వెంకటేశ్వర్లు, సంగారెడ్డి డీఈవో

రెగ్యులర్ మాదిరిగానే ఓపెన్ స్కూల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తాం. అభ్యర్థులందరూ పరీక్షా సమయం కంటే గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలి. ఎలాంటి నిషేధిత మెటీరియల్స్ కేంద్రాల్లోకి అనుమతి లేదు. పరీక్ష ప్రారంభమైన ఐదు నిమిషాల వరకే లోనికి అనుమతిస్తాం. కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా సంబంధిత కేంద్రం బాధ్యులపై శాఖపరమైన చర్యలు ఉంటాయి. రెగ్యులర్ పరీక్షల తరహాలోనే ఓపెన్ పరీక్షలు సజావుగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలి.

పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

- బి.అనురాధ, సిద్దిపేట సీపీ



ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల కోసం పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశాం. రేపటి నుంచి పరీక్షా కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్షలు జరిగే రోజుల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు సెక్షన్ అమల్లో ఉంటుంది. పరీక్ష కేంద్రాల నుంచి 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడ వద్దు. పరీక్ష సమయంలో కేంద్రాల వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తాం. విద్యార్థులు పరీక్షా సమయానికే గంట ముందే కేంద్రానికి చేరుకోవాలి. మానసికంగా ఎటువంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలి.

కోతల జోరు.. ఖర్చుతో బేజారు

అకాల వర్షాలతో హార్వెస్టర్‌కు పెరిగిన డిమాండ్

కొల్చారం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వరి కోతలు ఊపందుకున్నాయి. ఈదురుగాలులతో కూడి వడగండ్ల వానలు బీభత్సం సృష్టిస్తుండడంతో రైతులు భయంతో పంట కోతకు తొందర పడుతున్నారు. దీంతో హార్వెస్టర్ యంత్రాలకు డిమాండ్ పెరిగింది. రేటు మాట్లాడుకుని ముందుగా బుకింగ్ చేసుకున్నప్పటికీ హార్వెస్టర్ యజమానులు ఏదో కారణం చెబుతూ రావడం లేదు. ఎక్కడ ఎక్కువ డబ్బు ఇస్తే అక్కడికి కోత యంత్రాలను పంపిస్తున్నారు. రైతులు ఏంచేయలేక చెప్పిన ధర చెల్లించాల్సి వస్తున్నది. మంజీరా పరీహక ప్రాంతమైన కొల్చారం మండలంలోని యనగండ్ల, మాందాపూర్, కోనాపూర్, రంగంపేట, సంగాయపేట, చిన్నఘనపూర్, పోతంశెట్టిపల్లి గ్రామాల్లో ఎక్కడ చూసిన పొలాల్లో హార్వెస్టర్లతో వరి కోతల దృశ్యాలే కనిపిస్తున్నాయి. టైర్ హార్వెస్టర్‌కు గంటకు రూ.2500, చైన్ హార్వెస్టర్ యంత్రానికి రూ.3000 వరకు తీసుకుంటున్నారు. ఎకరాకు గంటన్నర చొప్పున యంత్రానికి రూ.4500 ఖర్చయిందని పోతంశెట్టిపల్లి రైతు పున్నయ్య తెలిపారు. ఇంత ఖర్చు పెట్టినా గతం కంటే దిగుబడి అంతంతమాత్రమే ఉందని రైతు వాపోయాడు.


కొల్చారం మండలంలోని పోతంశెట్టిపల్లి వద్ద వరి పంట కోస్తున్న చైన్ హార్వెస్టర్ యంత్రం

పశుగ్రాసం.. తెచ్చేసుకుందాం

మద్దూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : వేసవి దృష్ట్యా పాడి రైతులు పశుగ్రాసానికి ముందస్తుగానే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వరి కోతలు ముమ్మరంగా సాగుతుండడంతో మేత కోసం గడ్డిని సేకరిస్తున్నారు. కోతల అనంతరం కొంతమంది ఈ గడ్డిని ఉచితంగా ఇస్తుండగా, మరికొంత మంది ఎంతోకొంతకు విక్రయిస్తున్నారు. ఈ గడ్డిని తీసుకున్న పశుపోషకులు బేలర్ మిషన్లతో కట్టలు కట్టిస్తూ తరలిస్తున్నారు.



మద్దూరు మండలం లద్నూరులో ట్రాక్టర్‌పై గడ్డిని తరలించి పశువులపాక వద్ద వాము పెట్టుకున్న పాడి రైతు, లద్నూరులో ఓ పొలంలో గడ్డి కట్టలు



సిద్దిపేట పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని శుక్రవారం ఉమ్మడి జిల్లాలో ముస్లింలు కదం తొక్కారు. నారాయణఖేడ్, జోగిపేట, సిద్దిపేట, గజ్వేల్‌తో పాటు పలు చోట శాంతియుతంగా భారీ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు

వక్ఫ్ సవరణ వద్దు

ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ... ప్లకార్డులతో నిరసన

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ సవరణ చట్టం రద్దు అయ్యే వరకు వెనకడుగు వేసేది లేదని ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ నాయకులు, సిద్దిపేట తంజీమ్ అధ్యక్షుడు ఏజాజ్ హఫీజ్ అన్నారు. శుక్రవారం సిద్దిపేటలో శాంతియుత ర్యాలీని నిర్వహించారు. బస్‌స్టాండ్ నుంచి విక్టరీ చౌరస్తా మీదుగా ఇక్బాల్ మినార్ వరకు కొనసాగింది. ర్యాలీ అనంతరం వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ముస్లింలను ఇబ్బంది పెడుతుందని ఆరోపించారు. ముస్లింల అస్తిత్వాన్ని దెబ్బ తీసేలా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ బిల్లు వెంటనే రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జమైతే ఉలేమా అధ్యక్షుడు ముఫ్తీ సలాం, వివిధ సంస్థల పెద్దలు, యువత పాల్గొన్నారు. సిద్దిపేటలోని నసీర్‌నగర్ వాసులు సొసైటీ సభ్యులతో కలిసి ప్లకార్డులను ప్రదర్శించి నిరసన తెలిపారు.


జోగిపేటలో బైఠాయించిన ముస్లింలు

బిల్లును ఉపసంహరించుకోవాలి

గజ్వేల్/చేర్యాల/మిరుదొడ్డి/నారాయణఖేడ్/జోగిపేట రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలో భారీ ర్యాలీని నిర్వహించగా, మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి మద్దతు ప్రకటించారు. వక్ఫ్ బిల్లును ఉపసంహరించుకునే వరకు పోరాటం ఆగదని తన్జీముల్ మసాజిద్ కమిటీ చైర్మన్ సయ్యద్ మతీన్ అన్నారు. చేర్యాలలో స్థానిక చావడి నుంచి మసీదు వరకు ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ నాయకులు సంఘీభావం తెలిపి ర్యాలీలో పాల్గొన్నారు. దుబ్బాకలో ర్యాలీకి సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు భాస్కర్ మద్దతు తెలిపారు. మిరుదొడ్డి మండలంలోని అల్వాల్‌లో నిరసన వ్యక్తం చేశారు. జోగిపేటలో స్థానిక మదీనా మసీదులో చేతులకు నల్ల రిబ్బన్ పట్టీలు ధరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మసీదు నుంచి ర్యాలీగా అంబేడ్కర్ చౌరస్తాకు చేరుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. జోగిపేట పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ సత్తయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు.

వైభవంగా బేతాళస్వామి జాతర

పోటాపోటీగా ఎడ్ల బండ్ల ప్రదర్శన.. భక్తులతో కిటకిటలాడిన ఆలయం

అల్లాదుర్గం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అల్లాదుర్గం బేతాళస్వామి జాతర ఉత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఎక్కడా లేనివిధంగా అల్లాదుర్గంలో బేతాళుడి ఆలయం ఉండటంతో రాష్ట్రంతో పాటు పొరుగున ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు ఇలవేల్పుగా కొలుస్తుంటారు. ఆలయంలో ఏటా మూడు రోజులు జాతర నిర్వహిస్తుంటారు. ఉమ్మడి జిల్లాలో ఏడుపాయల జాతర తర్వాత ఇక్కడి జాతర ప్రసిద్ధిగాంచింది. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయం చుట్టూ ఎడ్లబండ్ల ప్రదక్షిణ నిర్వహించారు. బండ్లను ప్రదర్శించేందుకు భక్తులు పోటీపడ్డారు. ఉమ్మడి జిల్లావాప్తంగా భక్తులు వివిధ రకాలుగా అలంకరించిన ఎడ్లబండ్లను ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి మొక్కులను తీర్చుకున్నారు. ఉత్సవాలను తిలకించేందుకు వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగాణం కిటకిటలాడింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ రేణుకారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



జాతరలో ఎడ్లబండ్లను ప్రదర్శన, ఇన్‌సెట్‌లో ఆలయంలో కొలువుదీరిన బేతాళస్వామి


అశేష భక్తజనం మధ్య కొనసాగుతున్న సిద్దేశ్వరుని రథోత్సవం


అగ్ని గుండం ప్రవేశం

కన్నులపండుగగా సిద్ధేశ్వర రథోత్సవం

కంగ్టి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : కంగ్టిలోని సిద్ధేశ్వరుని రథోత్సవం శుక్రవారం సాయంత్రం అశేషభక్తుల మధ్య కన్నులపండుగగా కొనసాగింది. వేకువ జామున ఉత్సవమూర్తుల ఊరేగింపు చేపట్టిన అనంతరం స్వామి వారి రథం ముందు ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో నడుస్తూ భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కట్టెలతో ముప్పై అడుగుల ఎత్తుతో ప్రత్యేకంగా తయారు చేసిన రథాన్ని గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆలయం వరకు భక్తులు తాళ్లతో లాగారు. రథం ఊరేగింపు వ్యవసాయ పొలాల గుండా కొనసాగింది. దారి పొడవునా హరహర మహదేవ్ అంటూ మార్మోగింది. డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, టీపీసీసీ సభ్యులు శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ నాయకులు సాగర్ షెట్కార్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

సీతారామచంద్రస్వామి పునఃప్రతిష్ఠకు మాజీ ఉపరాష్ట్రపతికి ఆహ్వానం

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేటలో ఈనెల 21 నుంచి 23 వరకు నిర్వహించనున్న శ్రీసీతారామచంద్ర స్వామి పునఃప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడును ఆహ్వానించారు. హైదరాబాద్‌లోని జూబ్లీ హిల్స్‌లోని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు నివాసానికి శుక్రవారం ఉదయం వెళ్లిన రామాలయ కమిటీ అధ్యక్షుడు గుజ్జరి కనకరాజు ఆయనకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా శాలువాలతో సన్మానం చేశారు. కనకరాజు వెంట ఆలయ కమిటీ బాధ్యులు ఉన్నారు.


వెంకయ్య నాయుడుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న కనకరాజు

పనుల్లో డొల్లతనం

- చేర్యాల పోలీస్‌స్టేషన్ సమీపంలో కోతకు గురైన పార్కింగ్ టైల్స్
- చిన్న వర్షానికే గాంధీచౌక్ జలమయం
- వరదనీటితో కుంటను తలపిస్తున్న అంగడిబజారు చౌరస్తా
- డ్రెయిన్ నిర్మాణ పనుల్లో నాణ్యతాలోపంపై స్థానికుల ఆగ్రహం



అడ్డుగోడ లేకుండా నిర్మించిన డ్రెయిన్ వద్ద నాసిరకం పనులతో కుంగిపోయిన టైల్స్





బ్రిడ్జిపనుల్లో జాప్యంతో మురుగునీటిమయమైన గాంధీచౌక్, మురుగు కుంటలా అంగడిబజారు చౌరస్తా

చేర్యాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జనగామ-సిద్దిపేట జాతీయరహదారి విస్తరణలో భాగంగా పట్టణంలో చేపట్టిన డ్రెయిన్ నిర్మాణం పనులపై ఆది నుంచి అనుమానాలు వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షంతో పనుల్లో డొల్లతనం బయటపడింది. పలు ప్రదేశాల్లో అసంపూర్తిగా వదిలేసిన పనులు అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారాయి. పనులను సంబంధిత అధికారులు పర్యవేక్షించకపోవడంతో పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. చిన్నపాటి వర్షం కురిసినా పరిసరాలు మురుగునీటిమయంగా మారుతున్నాయి. డ్రెయిన్ కాలువ పనులు ఇంకా చేపట్టాల్సి ఉన్నప్పటికీ కొద్దిరోజులుగా రోడ్డు, డ్రెయిన్‌కు మధ్యన పార్కింగ్ టైల్స్ వేస్తున్నారు. డస్ట్ వాడి నాసిరకంగా చేపడుతున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు.

వర్షంతో బయటపడిన నాణ్యతాలోపం

పట్టణంలో శుక్రవారం కురిసిన వర్షానికి స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఉప్పల భద్రయ్య ఇంటి ఆవరణ ప్రదేశంలోని పార్కింగ్‌టైల్స్ కోతకు గురై దిగబడిపోవడం గమనార్హం. తీరా పరిశీలించే సరికి కాలువ నిర్మాణ సమయంలో అడ్డుగోడ నిర్మించకపోవడంతో నీటి తాకిడి తట్టుకోలేక టైల్స్ కుంగి గుంతలా ఏర్పడింది. డ్రైన్ అడ్డుగోడ లేకుండానే టైల్స్ నిర్మాణం చేపట్టిన విషయాన్ని గమనించిన స్థానికులు పనుల తీరుపై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా కానిచ్చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. కాగా గాంధీచౌక్ వద్ద వైన్ షాప్ ఆవరణతో పాటు ఎదురుగా డ్రెయిన్ కాలువను అసంపూర్తిగా వదిలేశారు.

మురుగునీటి మయంగా గాంధీచౌక్

గాంధీచౌక్ బ్రిడ్జి నిర్మాణం పనుల్లో జాప్యం కారణంగా వర్షం నీటితో పాటు ఆయా కాలువల గుండా మురుగు నీరంతా చేరి బ్రిడ్జి ప్రాంగణమంతా డ్రైనేజీనీటితో నిండిపోయింది. మురుగునీరు పోచమ్మ వీధి లోతట్టు ప్రాంతాలకు ప్రవహించడంతో వాహనదారులు, సమీపంలోని దుకాణాదారులు నానాతంటాలుపడ్డారు. అలాగే అంగడిబజారు చౌరస్తాలో కూడా డ్రెయిన్ పనులు అర్ధాంతరంగా నిలిపివేయడంతో వరద నీరు, మురుగు నీరంతా చేరింది. ప్రాంగణంలోని పండ్ల దుకాణాలు, కూరగాయల వ్యాపార బండ్ల వరకు చేరుకుంది. రోజుల తరబడిగా నిలిచి ఉన్న మురుగునీరు వర్షం నీటితో ఒక్కసారిగా ప్రవహించడంతో పట్టణంలోని ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతోంది. దారి పొడవునా దుర్వాసన రావడంతో స్థానికులతో పాటు రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

ప్రమాదకరంగా పోలీస్‌బూత్

చేర్యాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : జనగామ-సిద్దిపేట జాతీయ రహదారిపై చేర్యాల పట్టణంలోని అంగడిబజారు చౌరస్తావద్ద డివైడర్ల ఆవరణలో కొన్నాళ్లక్రితం ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పోలీస్‌బూత్ అత్యంత ప్రమాదకరంగా మారింది. పటిష్టచర్యలు చేపట్టకపోవడంతోపాటు పర్యవేక్షణ కరువై దెబ్బతిని కొద్దిరోజులుగా ప్రమాదకర పరిస్థితిలో ఊగిసలాడుతుంది. ఎవరూ పట్టించుకోకపోవడంతో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. పట్టణానికి ప్రధాన చౌరస్తాగా ఉండటంతో భద్రత నిమిత్తం సీసీ కెమెరా బిగించినప్పటికీ ట్రాఫిక్ పోలీస్ బూత్ దెబ్బతినడంతో నేలవాలిపోయింది. రోజులు గడుస్తున్నా దాన్ని సరిచేసేందుకు ఎవరూ చర్యలు చేపట్టలేదు. ప్రస్తుతం అకాల వర్షాలు, బలమైన ఈదురుగాలులు వీస్తుండటంతో కూలిపోయి ఈ దారి గుండా రాకపోకలు సాగించేవారికి ప్రమాదం పొంచి ఉంది. ఈ దారి నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ ప్రాంతంలో వ్యాపార దుకాణాలు, బ్యాంకు ఉన్నందున సీసీ కెమెరా నేలవాలిన క్రమంలో ఏదైనా సంఘటన జరిగితే పరిశీలించడం కష్టం. సంబంధిత అధికారులు స్పందించి ట్రాఫిక్ పోలీస్ బూత్ పునరుద్ధరణతో పాటు సీసీ కెమెరాను సవరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ట్రాఫిక్ పోలీస్ బూత్, (ఇన్‌సెట్‌లో)నేలవాలిన సీసీ కెమెరా

దాడి చేసిన వ్యక్తులపై కేసు

మద్దూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పాత కక్షలతో ఓ వ్యక్తి దాడిచేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ షేక్ మహబూబ్ తెలిపారు. శుక్రవారం ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం. లద్నూరు గ్రామానికి చెందిన కర్ర రాజశేఖర్ వ్యవసాయ పనులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో అదే గ్రామానికి చెందిన చిలువేరు రాజు, చిలువేరు రంజిత్ కుమార్ పాత కక్షలను మనసులో పెట్టుకుని రాజశేఖర్ బైక్‌ను అడ్డగించి బూతులు తిడుతూ కర్రలతో దాడి చేశారు. బాధితుడి తండ్రి కర్రె తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అక్రమ కేసులు పెడితే చూస్తూ ఊరుకోం



సిద్దిపేటలో మోదీ, అమిత్ షా ఫ్లెక్సీని దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, ఏప్రిల్ 18: కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై అక్రమ కేసులు పెడితే ఊరుకునేది లేదని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద మోదీ, అమిత్‌షా, కేంద్ర బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రధాని మోదీ ఫ్లెక్సీని దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోనియా, రాహుల్ గాంధీలపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సోనియా గాంధీ కుటుంబానికి, దేశ ప్రజలకు మోదీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ముద్దం లక్ష్మి, దాస అంజయ్య, మార్క సతీష్‌గౌడ్, పుట్ల ఏసు, కొత్తూరు నరహరి, కోదాది రమేష్, పొన్నల రాజేష్, ముత్యాల యాదగిరి, బొడ్డు బాలరాజు, బయ్యారం యాదగిరి, పుట్ల ప్రసాద్, రవీందర్‌గౌడ్, బాలరాజు, కనకయ్య, రామస్వామి, సామెల్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

19న ఇసుక వేలం

చేర్యాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేచరేణి గ్రామశివారులో ఇటీవల సీజ్ చేసిన సుమారు 100 ట్రిప్పుల ఇసుకను ఈ నెల 19వతేదీన వేలం వేయనున్నట్లు తహసీల్దారు మహమ్మద్ సమీర్ అహ్మద్‌ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు వేలంలో పాల్గొనాలని కోరారు.

యువత పాదయాత్రకు తరలిరావాలి

చిన్నకోడూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను పురస్కరించుకొని ఈనెల 25న సిద్దిపేట రంగదాంపల్లి చౌరస్తాలోని అమరవీరుల స్తూపం నుంచి సభ ప్రాంగణం వరకు నిర్వహించే పాదయాత్రకు మండలం నుంచి విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున తరలిరావాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కాముని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం చిన్నకోడూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులతో కలిసి మాట్లాడారు. పాదయాత్రలో పాల్గొనేవారు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు కాముని ఉమేష్ చంద్ర, యువజన విభాగం మండలాధ్యక్షుడు గుండెల్లి వేణు, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి భానుచందర్, నాయకులు పాల్గొన్నారు.

దళిత యువతి ఆత్మహత్యకు కారకులైనవారిని శిక్షించాలి

సిద్దిపేట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా, నిడమనూరు మండలం, బొక్కమంతల పాడు గ్రామానికి చెందిన మల్లీశ్వరిని పెళ్లి చేసుకుంటానని సహజీవనం చేసి, వంచించిన జాన్‌రెడ్డి, అతని కుటుంబసభ్యులపై వెంటనే హత్య కేసు నమోదు చేసి తక్షణం అరెస్టు చేయాలని మాదిగ జాగృతి సంఘం సిద్దిపేట జిల్లా కన్వీనర్ వేముల మల్లికార్జున్ మహరాజ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మల్లీశ్వరి కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని తెలిపారు. జాన్‌రెడ్డి మోసం చేయడంతోనే మల్లీశ్వరి ఆత్మహత్యకు పాల్పడిందన్నారు.

చోరీకి యత్నించిన వ్యక్తికి దేహశుద్ధి

చేర్యాల, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) చేర్యాల పట్టణంలోని మడేలేశ్వర ఆలయంలో హుండీ తాళం తీసి చోరీకి యత్నించిన గుర్తు తెలియని వ్యక్తిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకున్నది. ఆలయం వద్ద అనుమానాస్పదంగా కనిపించాడు. దీపపు చెమ్మతో హుండీ తాళాన్ని ధ్వంసం చేస్తుంటాన్ని చుట్టుపక్కలవారు గమనించి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు సమాచారమందించగా అదుపులోకి విచారిస్తున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్నీ ఇబ్బందులే: దుబ్బాక ఎమ్మెల్యే



దుబ్బాకలో కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి,ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కార్యకర్తలు అధైర్యపడొద్దని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం దుబ్బాకలోని రజనీకాంత్‌రెడ్డి ఫంక్షన్‌హాల్లో దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల బీఆర్ఎస్‌పార్టీ కార్యకర్తలతో రజతోత్సవ సభ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్‌ప్రభుత్వంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని, పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కైలాస్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మనోహర్ రావు, సతీష్‌రెడ్డి, వెంకటనర్సింహారెడ్డి, రజనీకాంత్‌రెడ్డి, రొట్టె రాజమౌళి, నాయకులు తదితరులున్నారు.

నేడు దుద్దెడ, కుకునూర్‌పల్లిలో..

కొండపాక/కుకునూరుపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే భారీ బహిరంగ సభ నేపథ్యంలో శనివారం కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో వేర్వేరుగా మండలస్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్టు పార్టీ నాయకులు వెల్లడించారు. కొండపాక మండలం దుద్దెడ మండలంలోని ఓ ఫంక్షన్‌హాల్ బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు నూనె కుమార్ తెలిపారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో కార్యకర్తలతో సన్నాహక సమావేశం ఉంటుందని మండల నాయకులు ఓ ప్రకటనలో వెల్లడించారు.

చర్చిలలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు





హుస్నాబాద్, మద్దూరు మండలం లద్నూరు చర్చిలలో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు

హుస్నాబాద్ టౌన్/చేర్యాల/మద్దూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆయా మండలాల్లోని గ్రామాల చర్చిల్లో గుడ్‌ఫ్రైడేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. యేసు శిలువపై మరణం ద్వారా ప్రేమను ప్రదర్శించిన రోజును పురస్కరించుకుని క్రైస్తవులు చర్చిలలో భక్తితో ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా యేసు మరణానికి ముందు చెప్పిన 7 మాటలను పాస్టర్లు వినిపించారు. హుస్నాబాద్ పట్టణంలోని బేతేలు ప్రార్థనా మందిరంలో గుడ్ ఫ్రైడే సందేశాన్ని పాస్టర్ ఇజ్రాయేల్ భక్తులకు వినిపించారు. ప్రత్యేక ఆరాధనల అనంతరం భక్తులకు పండ్ల రసాలను పంపిణీ చేశారు. అదేవిధంగా చేర్యాల, కొమురవెల్లితో పాటు మద్దూరు మండలంలోని లద్నూర్ చర్చిలో గుడ్ ఫ్రై డే వేడుకలను క్రిస్టియన్లు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చిలలో ప్రత్యేకప్రార్థనలు నిర్వహించారు.

కొమురవెల్లిలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి

చేర్యాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలంలోని అన్ని కొనుగోలుకేంద్రాల్లో వెంటనే ధాన్యం కాంటాలు ప్రారంభించాలని సీపీఎం కొమురవెల్లి మండల కార్యదర్శి తాడూరి రవీందర్ పేర్కొన్నారు. కొమురవెల్లి మండలం ఐనాపూర్‌గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం సీపీఎం నాయకుల బృందం పరిశీలించి రైతుల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ప్యాడీ క్లీనర్లను సమకూర్చలేదని, గన్నీసంచులు అందుబాటులోకి తీసుకురాలేదని, రోజులతరబడిగా రైతులు ఎదురుచూస్తున్నా కాంటా పెట్టకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కొనుగోలు ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తేలు ఇస్తారి, కర్రోల్ల ఎల్లయ్య, సున్నం యాదగిరి, ఉల్లంపల్లి నర్సమ్మ, తాడూరి రాజు, చెక్క ఉప్పలయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

అక్కెనపల్లిలో బ్రహ్మంగారి వారోత్సవాలు



స్వామి వారి కల్యాణంలో భక్తులు

నంగునూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నంగునూరు మండలం అక్కెనపల్లి గ్రామంలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ 29వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. పురోహితులు బ్రహ్మచారి ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. కల్యాణోత్సవానికి పరిసర గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ, మంగళహారతులు సమర్పించారు. గ్రామానికి చెందిన చామంతుల కమలవ్వ- రామచంద్రం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. స్వామివారి కల్యాణోత్సవంలో ప్లాస్టిక్ వాడకాన్ని నిర్వాహకులు నిషేధించారు. ఈ సందర్భంగా సుమారు 300 స్టీల్ ప్లేట్లు, గ్లాసుల్లో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు కైరంకొండ భాస్కర్, వెంకటయ్య, కొమురయ్య, పెద్దరాజిరెడ్డి, రజినీకర్ రెడ్డి, శ్రీనివాస్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డ్ బాలకిషన్‌కు ఆర్థిక సహాయం



బాలకిషన్‌కు ఆర్థికసాయం చేస్తున్న పోలీసులు

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ట్రాఫిక్ పీఎస్ టోవింగ్ వెహికల్ డ్రైవర్ బాలకిషన్, హోంగార్డు చాలా రోజులుగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. బాలకిషన్ భార్య అతడికి కిడ్నీ ఇవ్వడానికి ముందుకొచ్చింది. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీకి వెళ్తున్న బాలకృష్ణకు సిద్దిపేట ట్రాఫిక్ పోలీస్ అధికారులు, సిబ్బంది జిల్లా పోలీస్ సిబ్బంది అందరూ కలసి బాలకృష్ణకు ఆర్థిక సహాయం అందజేశారు. సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ చేతుల మీదుగా ఈ సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్‌ఐ గోపాల్ రెడ్డి, ఏఎస్‌ఐ రఘు, ట్రాఫిక్ సిబ్బంది, జిల్లా హోంగార్డు అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు శాకీర్, తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి కృషి

గజ్వేల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పరిధిలో తాగు నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లో నీటి సమస్య ఉందని తెలియడంతో శుక్రవారం ఆయన రెండు బోర్లను వేయించారనీ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునిసిపాలిటీతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని, వసతి గృహాల్లో పాఠశాలల్లో విద్యార్థులకు నీటి సమస్య రానివ్వబోమని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎడ్యుకేషన్ హబ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు నర్సారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, మార్కెట్ డైరెక్టర్లు నర్సింహారెడ్డి, అక్కారం యాదగిరి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మోహన్నగారి రాజు, రాములుగౌడ్, జంగం రమేశ్‌గౌడ్, గుంటుకు శ్రీనివాస్, సుఖేందర్‌రెడ్డి తదితరులున్నారు.

మూఢనమ్మకాలను వీడాలి

మిరుదొడ్డి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మూఢనమ్మకాల ముసుగులోపడి ప్రజలు మోసపోవద్దని మిరుదొడ్డి ఎస్‌ఐ పరశురాములు తెలిపారు. గురువారం రాత్రి మిరుదొడ్డి మండలం చెప్యాల గ్రామంలో కళాబృందంతో కలిసి కనువిప్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రాలకు చింతకాయలు రాలవని, మూఢనమ్మకాలను ఎవరూ నమ్మవద్దని సూచించారు. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరిగితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

స్లాట్ బుకింగ్ విధానాన్ని రద్దు చేయాలి

గజ్వేల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని రద్దు చేయాలని గజ్వేల్ దస్తావేజు లేఖరుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారు వారు గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ విధానాన్ని తీసుకురావడాన్ని నిరసిస్తూ గజ్వేల్ దస్తావేజు లేఖరుల సంఘం ఆధ్వర్యంలో శనివారం బంద్ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. స్లాట్ విధానంతో దస్తావేజు లేఖరులు రోడ్డున పడే అవకాశం ఉందని, ఈ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బస్వాపూర్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

కోహెడ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కోహెడ మండలం బస్వాపూర్ గ్రామంలో ఎస్సెస్సీ (1989-90)బ్యాచ్ పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. 35 ఏళ్ల తర్వాత ఒక్కచోట కలుసుకుని పరస్పర యోగక్షేమాలను పంచుకుంటూ, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్య నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముందుగా మృతి చెందిన విద్యార్థులకు ఆత్మ శాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రోజంతా ఆటపాటలతో సందడి చేశారు.

తాళ్లరాంపూర్ వీడీసీ దిష్టిబొమ్మ దహనం



కొమురవెల్లిలో వీడీసీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కల్లుగీత సంఘం నాయకులు

చేర్యాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా తాళ్లరాంపూర్‌లో ఆలయానికి వెళ్లిన గౌడ మహిళలను అవమానించారని పేర్కొంటూ శుక్రవారం చేర్యాల, కొమురవెల్లి మండలాల్లో కల్లుగీత కార్మికసంఘం ఆధ్వర్యంలో వీడీసీ దిష్టిబొమ్మను దహనం చేశారు. సంఘం మండలాధ్యక్షుడు తాళ్లపల్లిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి బండకింది అరుణ్ మాట్లాడుతూ గౌడ కుటుంబాల పట్ల అమానుషంగా ప్రవర్తించడం తగదని, వెంటనే వీడీసీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు విష్ణుమూర్తి, నర్సింహులు, శ్రీకాంత్, కనకయ్య, నరేశ్, అనగోని నర్సింహులు, ఆకుల కనకయ్య, పోతుగంటి లింగం, గుడాల గణేశ్‌తదితరులు పాల్గొన్నారు.

బీసీ గురుకులాల్లో బ్యాక్ లాగ్ సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష

కొండపాక, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబాఫూలే గురుకుల విద్యాలయాల్లో ఏర్పడ్డ బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి ఈ నెల 19వ తేదీన ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు సిద్దిపేట జిల్లా డీసీవో మహదేవుని శివకుమార్ తెలిపారు. సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా మూడు పరీక్షా కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 650 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. దరఖాస్తుదారులందరూ హాల్‌టికెట్‌లను వెబ్‌సైట్ ద్వారా డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12 గంటలకు వరకు పరీక్ష సమయం ఉంటుందన్నారు. గంట ముందే పరీక్ష కేంద్రానికి అభ్యర్థులు హాజరుకావాలని డీసీవో సూచించారు.

అన్ని రంగాల్లో యాదవులకు వాటా దక్కాలి



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న విద్యావంతుల రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ యాదవ్

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో యాదవులకు వాటా దక్కేందుకు రాజీలేని పోరాటాలు నిర్వహించాలని యాదవ విద్యావంతుల రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేటలోని శ్రీకృష్ణ యాదవ ఫంక్షన్ హాల్‌లో జరిగిన జిల్లా యాదవ విద్యావంతుల రాజకీయ శిక్షణ తరగతుల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. యాదవులకు విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక రంగాల్లో జనాభా నిష్పత్తి ప్రకారం వాటా దక్కేవరకు యాదవజాతిని నిత్యం జాగృతం చేసే బాధ్యత విద్యావంతులకు ఉందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు యాదవులను పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. యాదవుల కోసం పోరాడుతున్న సంఘాలకు అండగా ఉంటూనే మనం కూడా యాదవ జాతికి జాతి కోసం పని చేస్తున్న వాళ్లకి సహాయ సహకారాలు అందించాలన్నారు. సమావేశంలో భూభారతి చట్టం పైన, మహిళా రిజర్వేషన్ల పైన, మూఢనమ్మకాల నిరోధం, బాల్యవివాహాలపై ఒక్కొక్కరు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వక్తలు పోచబోయిన శ్రీహరి యాదవ్, బాలనర్స్ యాదవ్, అచ్యుత్ యాదవ్ తదితరులు వివిధ అంశాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పోచబోయిన శ్రీహరి యాదవ్ , గొర్రె మల్లికార్జున్ యాదవ్, ఉండ్రాళ్ల రాజేష్ యాదవ్, దాసరి రాజుయాదవ్, దువ్వల్ల మల్లయ్య యాదవ్, పయ్యావుల రాములు యాదవ్, మామిళ్ళ ఐలయ్య యాదవ్, కనుకచంద్రం యాదవ్,బత్తుల రాములుయాదవ్ మామిళ్ల రాముయాదవ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని విస్తరించి నూతన కమిటీని ప్రకటించారు.





చేర్యాలలో బలమైన ఈదురుగాలులతో కురుస్తున్న వర్షం, కొమురవెల్లిలో తడిసిన ధాన్యం సంచుల నుంచి నీటిని తొలగిస్తున్న మహిళా రైతు

ఆగమాగం

(5వ పేజీ తరువాయి)

ప్రాణాపాయం తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. ముస్త్యాలలో ఈదురుగాలులకు ఎండీ ఎజాస్ ఇంటి రేకులపైకప్పు కూలింది. సరుకులు, సామాగ్రి దెబ్బతింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

తాటిచెట్టుపై పిడుగు

చేర్యాల మండలం గుర్జకుంట గ్రామశివారు తాటివనంలోని ఓ చెట్టుపై పిడుగుపడింది. దీంతో చుట్టుపక్కల రైతులు, తాటివనంలోని కల్లుప్రియులు ఒక్కసారిగా భయాందోళన చెందారు.

బాధితులకు ఫోన్‌లో పల్లా పరామర్శ

అకాలవర్షంతో చేర్యాల, కొమురవెల్లి మండలాల్లో జరిగిన నష్టంపై జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరా తీశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతు ల ఇబ్బందులను, తడిసిన ధాన్యం వివరాలను తెలుసుకున్నారు. పిడుగుపాటుకు గేదెలను కోల్పోయిన పోతిరెడ్డిపల్లికి చెందిన గుడిసె లలిత, గడ్డంనరేశ్‌ను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫోన్‌లో పరామర్శించారు. చేర్యాల తహసీల్దారు సమీర్ అహ్మద్‌ఖాన్‌తో మాట్లాడి ప్రభుత్వం తరఫున బాధితులను ఆదుకునే విషయమై పలు సూచనలు చేశారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

వర్షం కారణంగా పలు మండలాల్లో గ్రామాల్లో చెట్టు కొమ్మలతో పాటు ఇంటి పైకప్పుల రేకులు విద్యుత్ తీగలపై పడడంతో సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ అధికారులు, సిబ్బంది శ్రమించి వాటిని తొలగించి సరఫరా పునరుద్ధరించారు.